# చూపుడు వేలు

కుప్పాల వెంకట సుబ్బారావు

**అడ్మినిస్ట్రేటివ్** ఆఫీసు నుంచి ఆఫీసు జనమంతా బయటకొచ్చేరు అప్పుడే. అందరూ గుంపులు గుంపులుగా ఎదురుగా నిలబడ్డ కంపెనీ బస్సులవైపు కదులుతున్నారు.

కాసేపటికి బస్సులు నిండాయి. ముందు సీట్లు ఆడవాళ్ళు ఆక్రమించుకుంటే, మిగిలిన సీట్లలో మగవాళ్ళు సర్దుకున్నారు.

బస్సులు పట్టణంవైపు బయలుదేరాయి.

లలిత కిటికీ ప్రక్కన కూర్చుని, కన్పించే దృశ్యాలను చూస్తోంది. ఆమె ప్రక్కనున్న రమ ఎదుటి సీట్లోని లక్ష్మితో మాట్లాడుతోంది. మిగిలిన జనం గూడా పిట్టాపాటీలోకి దిగారు.

కొంచెం దూరం వెళ్ళేక వెనుకనుంచి మాటలు విన్పించాయి లలితకి.

"ఆ ప్రక్కన కూర్చున్నదే గదూ... బ్లూ శారీ..."

"అదే— భాస్కరం గారి లవ్..."

"అదా?"

"అదే! భాస్కరం గారు వాడుకున్నన్నాళ్ళూ వాడుకొని హేండిచ్చేడు."

"ఇష్... చిన్నగా..."

లలిత గుండె వేగంగా కొట్టుకుంది. తను కట్టుకున్న చీర వంక చూసుకుంది.

బ్లూ కలర్... ఒళ్ళు గగుర్పొడిచినట్లయింది.

విద్యాధికురాలు... సాటి ఉద్యోగస్థురాలు అయిన తనని చదువు, సంస్కారం, బుద్ధి, జ్ఞానం అన్నీ ఉన్నాయనుకునే సాటి ఉద్యోగస్థులు తన వెనకే ఇంత కర్కశంగా, అనాగరికంగా, అమానుషంగా మాట్లాడుకోగలరన్న నిజం భరించలేనట్లుగా అన్పించింది లలితకు.

అంత స్పష్టంగా తనకి విన్పించిన ఆ మాటలు వెనక సీట్లలో ఇంకెందరు విన్నారో... ఇంకెందరు వింతగా తనని చూస్తున్నారో?

కొద్దిగా తల తిప్పి ఒకసారి వెనక్కు చూడాలన్పించింది గానీ, తన వల్ల కాలేదు.

వాళ్ళు మాట్లాడుకున్న మాటలే చెవుల్లో మార్మోగుతున్నాయి. ఆ మాటల్లోని తూష్ణీంభావం తూట్లు పొడుస్తోంది హృదయాన్ని.



ఏదో అవమానం... అసహ్యం... చేతగాని తనం.

మనసంతా అల్లకల్లోలమై పోయింది.

బస్సు దిగి ఇంటికెలా చేరిందో తనకే తెలీదు. ఆ రాత్రి భోజనం సహించలేదు. కంటి మీదకి నిద్ర రాలేదు.

ఆలోచనలు... మెదడునీ, మనసునీ తొలిచేస్తూ... ఆలోచనలు.

* * *

అదో పెద్ద హాలు.

ఈ చివర నుండి ఆ చివర వరకు రకరకాల సెక్షన్లున్నాయి. ఆఖరునున్న సెక్షన్‌లో మూలనున్న సీటు లలితది.

ఆఫీసుకి వచ్చిన దగ్గర్నుంచి తన పనేమిటో, తానేమిటో అన్నట్టుగా వంచిన తల ఎత్తకుండా పని చేసుకుంటుం దామె.

ఓ రోజు— "మిస్ లలితా! ఇతని పేరు భాస్కరం. కొత్త అసిస్టెంట్" అంటూ సెక్షన్ హెడ్ పరిచయం చేశాడు అతణ్ణి.

"నమస్కారం" అంది లలిత.

భాస్కరంతో లలిత తొలి పరిచయం అలా జరిగింది.

భాస్కరానికి లలిత కళ్లంత దూరంలో ఏర్పాటయింది సీటు.

ఆ సెక్షన్‌లో రకరకాల వయసుల వాళ్ళు పదిమంది దాకా ఉన్నారు. వాళ్ళలో లలిత ఒక్కర్తే ఆడపిల్ల.

భాస్కరం చూపులు పదే పదే తనమీద కేంద్రీకరింపబడుతున్నాయన్న అనుమానం ఓ రోజు అకస్మాత్తుగా తలెత్తింది.

అనుమానాన్ని నిర్ధారణ చేసుకుందుకు తనూ గమనించింది లలిత.

అనుమానం లేదు! అతని చూపులన్నీ తనమీదే!

లలితకు ఆశ్చర్యమేసింది.

అదో కొత్త అనుభవంగా అన్పించింది.

ఏదో ఆకర్షణగా... ఆశగా... అన్పిస్తున్న అతని చూపుల్లోని భావానికి లలితలో తనకే తెలీని ఏదో కదలిక... ఆమెలోని ఆడతనం తొలిసారి సిగ్గుపడింది.

అతను తనకన్నా అయిదారు నెలలు జూనియర్. వయసులో కూడా తనకన్నా అయిదారు నెలలు చిన్నవాడు అయిఉండొచ్చు. ఇంకా పెళ్ళి కానట్టుగానే ఉంది.

మంచి ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు, నొక్కుల క్రాఫు-చూడగానే ఆకర్షిస్తాడు. అందరితో సరదాగా ఉంటాడు.

రోజులు గడిచేకొలది... అతనిలో బెరుకు పోయిందో, ఆమెలో అలుసు దొరికిందో... అతని చూపులు ఆమెని మరీ చుట్టేయడం మొదలు పెట్టాయి.

ఏదో ఆబగా... ఆశగా... ఇంటికి వెళ్ళినా లలితని ఆ చూపులే వెంబడించడం మొదలయింది.

రాత్రుళ్లో అలస్యంగా నిద్రపట్టడం, నిద్రలో గూడా ఆ చూపులే తనని చుట్టేస్తున్నట్టు మనసులో ఏదో అలజడి... అశాంతి లలితకు. అయినా, ఆమె కా బాధ బాధగా అన్పించలేదు!

"ఇకనుంచి నా స్థానం మీప్రక్కనే" అన్నాడు భాస్కరం నవ్వుతూ ఓ రోజు.

అయోమయంగా చూసింది లలిత.

"మరేం కంగారు పడకండి. సెక్షన్ హెడ్ ఇకమీదట నన్నీ సీటు చూడమన్నారు" అన్నాడు.

ఇతని అభ్యర్థన మీదనే తన ప్రక్క సీటులోని రామానుజం, ఇతను పరస్పరం సీట్లు మార్చుకున్నారని ఆ తరువాత తెలిసింది లలితకు.

ఇప్పుడు లలితదీ, అతనిదీ కంబైన్డ్ వర్కు.

ప్రతి దానికీ ఒకరి నొకరు పలకరించుకోవడం తప్పనిసరి. ఏదో ఇబ్బందిగా, ఇరుకుగా అన్పించింది.

అనవసరంగా కూడా ఏదో కల్పించుకొని మాట్లాడటం మొదలుపెట్టేడు భాస్కరం.

"ఫలానా సినిమా చూశారా?"

"ఫలానా పుస్తకంలో ఫలానా కథ... నవలా చదివారా?" ఇవీ ప్రశ్నలు.

అతని మాటల్లో, చేష్టల్లో అర్థం కానంత తాపత్రయ మేమీ లేదు. ఆతని తాపత్రయాన్ని అర్థం చేసుకోలేనంత అమాయకురాలేం కాదు తను.

అతను ముమ్మాటికీ తన నిష్టపడుతున్నాడు!

కానీ... అదెలాంటి ఇష్టం?

తను "ఊఁ" అంటే పెళ్ళి చేసుకుంటాడా?

తన 'ఊహ' తప్పు కాకపోతే అతనందుకు సిద్ధమేలా కన్పిస్తున్నాడు.

అదే నిజమైతే? తన కంతటి, అర్హత...అదృష్టం ఉన్నాయా? అది జరిగే పనేనా?

తన చుట్టూ సమస్యల వలయాలు... వాటిని ఛేదించుకొని తను ఎలా బయట పడగలదు? తను తన స్వార్థమే చూసుకొని ఒకవేళ బయటపడితే, తన మీదే ఆధారపడిన తన తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముడు-వాళ్ళంతా ఏమయి పోతారు? వాళ్ళ భవిష్యత్తేమిటి?

తనను, తనతో పాటు వెంట వచ్చే సాధక బాధకాలన్నింటినీ భరించే శక్తి అతని కున్నదా? అంతటి సహృదయత, అంతటి విశాల దృక్పథం అతనిలో ఉన్నాయా?

అసలింతకూ అతను తనలో ఆశిస్తున్న దేమిటి? తనో పెద్ద అందగత్తె కాదు. తనలోని ఆకర్షణ కూడా అంతంత మాత్రమే అన్న విషయం తనకి తెలియందేమీ కాదు. కేవలం తన సంపాదనే అతనికి ఆకర్షణా హేతువైతే, ఆ విషయంలోనూ తను అశక్తురాలే!

అతన్నించి ఎలాంటి ప్రతిపాదనొస్తుందో అని ఎదురు చూస్తుండి పోయింది లలిత.

తనను, తన పరిస్థితులను సంపూర్ణంగా అర్థం చేసుకొని అతను ముందుకొస్తే తను నిజంగా అదృష్టవంతురాలే అనుకుంది. చివరికి ఆ విషయం నిర్ధారణ అయ్యే వరకు తను తొందరపడి ఆశలు పెంచుకో కూడదని నిర్ణయించుకొంది.

"మిస్ లలితా! మీతో ఓ ముఖ్య విషయం ఈ రోజు మాట్లాడాలను కుంటున్నాను. దయచేసి ఈ సాయంత్రం బీచ్‌కి రాగలరా!" ఆ మాటలన్నది భాస్కరం.

లలిత మౌనంగానే అందుకు ఒప్పుకుంది.

ఆ సాయంత్రం బీచ్‌లో—

"లలితగారూ! నా మనసులో మాట చెప్పేస్తున్నాను. మిమ్మల్ని నేను చాలా లైక్ చేస్తున్నాను. మీ రిష్టపడితే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు భాస్కరం.

ఇదంతా తను అనుకున్నదే అయినా, అతని నోటి నుంచి ఆ మాటలు వింటుంటే అదో వింత అనుభూతిగా అన్పించింది లలితకి.

ఈ ప్రేమ భావంలోని మాధుర్యం ఎంత గొప్పగా ఉంది? నిజంగా తను ధన్యురాలు. నిరాశ... నిస్పృహ... నిట్టూర్పుల మధ్య... అగమ్యం... అశాంతి... అంధకారాల మధ్య బ్రతుకును భారంగా వెళ్ళబుచ్చుతున్న తన జీవితంలో అతని మాటలు ఉషోదయంలా... తొలకరి జల్లులా... ఎంతో హాయిగా... ఇంకెంతో గొప్పగా అన్పించాయి.

కానీ... తన మీద ఉన్నది గురుతరమైన బాధ్యత. తాను వివశురాలై, తన బాధ్యతలను విస్మరిస్తే, ఆ తరువాత తను సుఖపడగలిగిందేమీ ఉండదు.

"మీకు బహుశః నా కుటుంబ సంగతులు తెలీవు. నాకున్న బాధ్యతలు చిన్నవి కావు. ఒక్క రోజుతో అవి తీరేవీ కావు." ఒక్కొక్కటే తన పరిస్థితులన్నింటినీ దాపరికమేమీ లేకుండా అతని ముందు ఏకరువు పెట్టింది లలిత.

అతను స్తబ్ధంగా అన్నీ విన్నాడు.

అతని చూపులు శూన్యంలో చిక్కుకు పోయాయి కాసేపు.

లలిత మోకాళ్ళ మీద తల నాన్చుకొని, అతని వంకే చూస్తుండి పోయింది.

ఏం వినవలసి వస్తుందో అని ఆమె మనసులో ఆత్రంగా ఉంది.


అతను ఆమె కళ్ళలోకి చూశాడు.

అతని ముఖంలో ప్రసన్నత... అతని పెదవులపై చిర్నవ్వు... అతని చేతిలో ఆమె చెయ్యి మృదువుగా నలుగుతోంది- "లలితా! ఇక నుంచి 'నీ' సమస్యలు 'మన' సమస్యలు! అయినా, మనం ఇద్దరం కలిస్తే అవేమీ పెద్ద సమస్యలు కావు." ఎంతో మధురంగా అతని నోటి నుంచి వెలువడ్డాయి ఆ మాటలు.

కాసేపు తనని తనే నమ్మలేక పోయింది లలిత.

అంతా ఏదో కలలా అన్పించింది.

నిజంగా ఇది నిజమేనా? తానింత అదృష్టవంతురాల్నా? తానిన్నాళ్ళూ తనను విధివంచితు



రాలిగా అనుకుంటూ వస్తోంది. చిన్నప్పట్నించి తమ కుటుంబంలో జరుగుతూ వస్తోన్న సంఘటనలన్నీ తన నలాంటి నిరాశా వాదంలోకే నెట్టాయి.

ఎప్పుడు చీకటి పడిందో తెలీదు.

లలితని అమాంతం ఒళ్ళోకి లాక్కున్నాడు భాస్కరం. ఆమెని గట్టిగా కావలించుకొని, పెదవులపై చుంబించాడు.

ఈ హఠాత్పరిణామానికి బిత్తర పోయింది లలిత.

"వదలండి... ప్లీజ్..." అంటూ తనని తాను విడిపించుకుంది.

* * *

రోజులు వేగంగా గడిచిపోతూ వచ్చాయి.

ఎక్కడో దూరంగా ఉన్న తన అమ్మా, నాన్నా వాళ్ళకు తమ విషయం త్వరలోనే చెప్పి వాళ్ళ ద్వారా పెళ్ళిచూపులు ఏర్పాటు చేయిస్తా నన్నాడు భాస్కరం.

అతను ఒంటరిగా ఉంటుండే వాడు.

లలితను తన రూమ్‌కు రమ్మనే వాడు. లేదా తానే ఆమె ఇంటికి వచ్చేస్తాననే వాడు. లేక పోతే బీచికి, సినిమాలకి పిలిచే వాడు.

పెళ్ళి కాకుండా తన కలాంటివి ఇష్టముండదని అతని కెలా చెప్పడం! చెప్పినా "అయితే నా మీద నమ్మకం లేదన్నమాట?" అనే వాడు.

అడకత్తెరలో పోకలా నలిగేది తను. ఎంత కూడదనుకున్నా, కొన్ని కొన్ని సార్లు అతణ్ణి మన్నించవల సి వచ్చేది. అన్ని సార్లూ అతని చిలిపి చేష్టలని నివారించడం తనకి కష్టమైపోయేది.

అతని ప్రవర్తన ఒక్కో సారి ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తుండేది. అలా అనుమానాలు రేకెత్తినప్పుడల్లా మనసులో తుఫానులు చెలరేగేవి.

అనుకోకుండా అతనికి వేరే డిపార్ట్‌మెంటుకు ట్రాన్స్‌ఫరయింది. అ దో అపశకునంలా మనసుకి తట్టింది.

అతను వెళ్ళిపోయాడు.

అంతా మళ్ళాళ్ళ ముచ్చటలా ముగి సి నట్లని పించింది.

అతని దర్శనమే కరువయింది.

అతను తలపు కొచ్చినప్పుడల్లా మనను మరులుగొన్నట్లయి అతణ్ణి చూడాలని తహతహలాడేది.

కంపెనీకి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు అతని కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని అంతటా చూచేది. ఒకటి రెండు సార్లు కన్పించాడు గాని, అంత మందిలో ఎలా కలును కోవడం? ఎలా మాట్లాడటం?

ఓ నిశ్చయాని కొచ్చిన దానిలా, ఓ రోజు అతని రూముకు బయలు దేరింది లలిత.

ఈ విషయం ఇక అటో, ఇటో తేల్చుకోవాలి. ఇంకెన్నాళ్ళీ ఊగిసలాట!

ఆమె అతని రూమ్ చేరేసరికి లోపల ఎవరో పెద్ద వాళ్ళున్నారు.


భాస్కరం హడావిడిగా బయటికొచ్చి, "మనం తర్వాత కలుద్దాం" అన్నాడు.

"ప్లీజ్! ఒక్క పది నిముషాలు. నాతో రండి. అలా హొటల్ కెళదాం" అంది లలిత.

అటూ, ఇటూ చూ సి "పద" అన్నా డతను.

హొటల్లో టేబుల్ కెదురెదురుగా కూర్చున్నారిద్దరూ.

అప్పటికే ఓ నిర్ణయాని కొచ్చేశాడు భాస్కరం. ఆమె అలా ఎందుకు పిలుచుకు వచ్చిందో అతను ముందుగానే గ్రహించేశాడు.




పెద్దవాళ్ళు ఇప్పుడే ఓ సంబంధం తీసుకొచ్చారు. ఇక్కడే బ్యాంకులో ఉద్యోగమట ఆ అమ్మాయికి. చాలా అందంగా ఉంటుందట. తల్లితండ్రులకి ఒక్కర్తే పిల్లట. ఆస్తిపాస్తులున్నాయి. బాదరబందీలు లేవు.

ఈ లలితకూ, ఆ అమ్మాయికీ ఏ రకంగానూ పోలిక లేదు.

ఆ అమ్మాయిని చేసుకుంటే ఇక సర్వసౌఖ్యాలు తనవే. అదే ఈ లలితను చేసుకుంటే కోరి కష్టాలను నెత్తి కెక్కించుకున్నట్లు! పైగా తల్లితండ్రుల వ్యతిరేకత!

ఈ రోజు అదృష్టం తనని వెతుక్కుంటూ వచ్చింది. తాను తొందరపడి లలితతో సాన్నిహిత్యాన్ని పెంచుకోవడం ఎంత తెలివితక్కువ పనైపోయిందో ఇప్పుడు తెలుస్తోంది. తమ మధ్య సంబంధం తొలిదశలోనే ఆగిపోవడం కేవలం తనింత అదృష్టానికి వారసుడు కావడం వల్లనే అయియుండాలి.

ఇప్పుడు లలిత కెలాగయినా నచ్చచెప్పాలి.

అది ఇబ్బందే! కానీ, ఒక్కనాటితో తీరిపోతుంది. బ్రతుకంతా వెంటరాదు. తను ఓ బ్రహ్మాండమైన రొంపిలోంచి బయటపడతాడు. ఆ తరువాత లలితకు కూడా గంతకు తగ్గ బొంతలా ఏదో సంబంధం కుదరకపోదు. ఆ తరువాత ఎవరి బ్రతుకు వాళ్ళది. చాలా ఎక్కువగానే ఆలోచించాడు భాస్కరం.

"ఈ మధ్య మనం కలునుకుందికే కుదరడం లేదు. మన పెళ్ళి విషయం వెంటనే తేల్చుకుంటే బావుంటుంది" అంది లలిత.

భాస్కరం కొంచెం ఇబ్బందిగా కదిలినా అతనీ పరిస్థితి నెదుర్కోనేందుకు సిద్ధంగానే ఉన్నాడు.

"లలితా! నన్ను క్షమించు. మాపెద్దవాళ్ళు నాకు వేరే సంబంధం నిశ్చయించారు. వాళ్ళ మాటని కాదనే పరిస్థితిలో నేను లేను" అన్నాడు.

ఆ మాటలు వింటూనే నిర్విణ్ణురాలైంది లలిత.

కళ్ళముందు చీకట్లు పరుచుకున్నాయి. కళ్ళలో కన్నీరు ఉబికింది.

ఎంత తేలిగ్గా చెప్పాడు!

తన బ్రతు కేదో తను బ్రతుకుతున్న తనను కదిలించి, ఆశలు రేపి, ఈ రోజు తన స్వార్థం తను చూసుకుంటూ తనను అర్థాంతరంగా అగాథంలోకి త్రోసేస్తున్నాడు.

"హుం! ఈ మాత్రానికేనా, భాస్కరంగారూ, నాకు ఎన్నెన్నో కబుర్లు చెప్పారు! బాసలు చేశారు! ఒక ఆడదానితో సంబంధం ఏర్పరచుకోవడం, తెగత్రెంపులు చేసుకోవడం మీ కింత సులువా?"

"వయసులో ఉన్న ఆడా, మగా మధ్య రకరకాల ఆకర్షణలు పుట్టడం సహజం. ఆ ఆకర్షణలో, ఆ మోహంలో ఏవేవో చెప్పుకోవడం, అనుకోవడం కూడా మామూ లే! కానీ, జీవితం అంటే ఆ మాత్రమే కాదు కదా! అన్నీ ఉన్న ఆ అమ్మాయి, ఏమీ లేని నువ్వు ఇప్పుడు నాకు తారసపడ్డారు. నాముందు బోలెడు భవిష్యత్తు ఉంది. ఇప్పుడు నేనే నిర్ణయం తీసుకుంటే బాగుంటుందో నువ్వే చెప్పు." అతనిలోని సౌమ్యత, ఆ మాటల్లోని మార్దవం చురకత్తుల్లా దిగబడుతున్నాయి హృదయంలోకి.

తనెంత వచ్చిగా వంచించబడింది!

"నీ కష్టమే నా కష్టం, నీ సుఖమే నా సుఖం అని ఆ రోజు నమ్మించి నన్ను గాఢాలింగనం చేసుకొని, ఈ నోటితోనే నన్ను ఎంగిలి చేసినప్పుడు... అప్పుడు ఈ జీవితం, భవిష్యత్తు మీకు గుర్తులేవా, భాస్కరంగారూ!"

మౌనమే సమాధానంగా తల దించుకున్నాడు భాస్కరం.

"హుం! ఎంతైనా మీరు మగవాళ్ళు. పైగా తెలివైన వాళ్ళు. చాలా తెలివైన నిర్ణయమే తీసుకున్నారు. నిజమే! కోరి కష్టాలను తల కెత్తుకోవడం ఎవరికైనా మంచిది కాదు. నా కంటే మంచి పొజిషన్‌లో ఆ అమ్మాయి ఉంది గనుక ఆ అమ్మాయినే చేసుకోండి. పెళ్ళయ్యాక మీ కంటే మంచి పొజిషన్‌లో ఉన్న మరో మగాడు తారసపడితే ఆ అమ్మాయి మిమ్మల్ని వదిలేయకుండా ఉండాలని కోరుకుంటున్నాను."

మాటలు కొరడా దెబ్బల్లా తగిలించి అక్కణ్ణుంచి బయటపడింది లలిత.

** *** **

జరిగిన యథార్థం ఇది.

ఇది జరిగి సంవత్సరమయింది.

భాస్కరం పెళ్ళి ఆ నాడే జరిగిపోయింది.

అలా ఏ ఆలోచనలు లేకుండానే ఆమె తన బ్రతుకు తను బ్రతుకుతూండేది. ఇప్పుడూ అదే అలవరుచుకుంది. జరిగినదా న్నో పీడ కలగా మర్చిపోయింది.

అయితే, ఆమె జీవితంలోకి కావాలని చొరబడినవాడు భాస్కరం.

ఆమెలో లేని ఆశలను, కోర్కెలను కలిగించినవాడు భాస్కరం.

చివరకు తన నైజం చూపించుకున్నవాడు భాస్కరం.

కానీ, అతని నీడ ఆమె జీవితాని కో మచ్చ అయింది.

ఆ మచ్చవైపు ఈ రోజు కొందరి చూపుడువేళ్ళు గురిపెట్టబడి ఉన్నాయి. ఆమె ప్రశాంతిని భంగపరుస్తున్నాయి.

ఇదెంతవరకు న్యాయం?

జరిగినదాన్లో ఆమె దోషమేమిటి? ఆమె ప్రమేయమేమిటి?

ఈ గురి పెట్టబడిన చూపుడువేళ్ళకు ఆమె మనసులోని క్షోభ, ఆ క్షోభకు కారణమైన కథ నిజంగా తెలుసా?

ఇలా గురి పెట్టబడ్డ వేళ్ళు అవతలి వ్యక్తిలోని మనఃస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కుంగదీస్తాయని తెలుసా?

ఒక వేలు ముందుకు చూ స్తే, నాలుగు వేళ్ళు వెనక్కు చూస్తూంటాయని తెలుసా?

సమాజం ఎంతగా ఎదిగినా, ఎంతగా నాగరీకం పెరిగినా ఈ 'చూపుడు వేళ్ళ' కథ ఇంతేనా?

లలితలాంటి కథలు వెతలేనా?.